


# చీకటి రాత్రి

★ కిశోర్

ప్రశాంతమైన కాలం. చల్లటిగాలి చెట్లముందుగా వీస్తోంది. లక్ష్మీకాంతం వీధిగేటుకి సమీపంగా నిలబడి ఎవరికోసమో బిత్తరగా చూస్తున్నాడు. కాలేజీలో విడుపుగంటలన్నీ పూర్తి కావస్తున్నాయి. ధనవంతులు విద్యార్థులు వీధిలోకి వచ్చారు. మిగిలినవారు వనితాబృందంతో కలిసి మెల్లగా నడుస్తున్నారు. ఆ వెనకగా ప్రధానగురువులు, వారి ఆదరణాభిమానాలు చూరగొన్న ప్రియశిష్యులు, మరికొందరు స్త్రీ విద్యార్థులు నిశ్శబ్దంగా మెట్లు దిగుతున్నారు.

ఒక్కొక్కరినీ పరికిస్తూ ఆశతో చూస్తున్న కాంతుని విశాల నయనాలు విప్పారుకుని చూస్తునే వున్నవి. విరామం లేకుండా విద్యార్థుల - గుంపులు వరుసలుగా వెళ్ళిపోయాయి. ప్రధాన గురువులు, వారి బంట్రోతులు సహా కాలేజీని విడిచిపెట్టారు.

కాంతం మాత్రం యింకా ఆ గేటుదగ్గరే నిల్చుని చూస్తున్నాడు. కొంచెం తెప్పరిల్లి నిరాశాముఖంతో మరొకచోటికి ప్రయాణమయ్యాడు. ఎక్కడికి వెళ్ళాలో, ఏవీధిలో నడవాలో బోధపడటంలేదు. అతనికి హృదయం ఎక్కడో, ఎవరికో వెతుక్కుంటోంది. మనస్సు మందగించి ఖాళీగా నడుస్తోంది. అవగాహనం కానివాలకం వెలిబుచ్చుతూ, తనలో తానే మాట్లాడుకుంటూ— అవశ్యంగా గమ్యస్థానానికి దారితీశాడు.

సాయంత్రం ఎనిమిదయింది. పగలంతా కార్యనిర్వహణంలో నిమగ్నులై విశ్రాంతి కోసం తహతహలాడే బానిస జీవులు కాళ్ళీడ్చుకుంటూ తమతమ గూళ్ళకు చేరుకుంటున్నారు. వీధులన్నీ ఏకోణంలోనించి చూచినా నిశ్శబ్దానికి తావులేకుండా వుంది. అన్నిబాటలు అల్లరులతో విహరిస్తున్నాయి.

కాంతం తిన్నగా యిల్లుదాటి మరి రెండు యిళ్ళవరకూ నడిచివెళ్ళాడు. ఏదో పొరబాటు చేస్తున్నట్లు అంతరాత్మ చెపుతోంది. మనస్సు మళ్ళీ మనస్సులో చేరింది. పరధ్యాన్నంతో యిల్లుదాటిన సంగతి తెలివి తెచ్చుకుని వెనక్కి తిరిగాడు.

ప్రమిద వెలిగించి కాంతానికై వేచి కూచున్న తల్లి కాంతుని చూడగానే హృదయాన్ని వుప్పొంగించుకుంది, ఔను! మాతృమూర్తి తన ప్రేమబిడ్డను చూచి మురిసిపోవడం ఆశ్చర్యం కాదు.

“కాంతం! ఇంతవరకు ఎక్కడికి వెళ్ళావు నాన్నా!”

“ ... ... ... ”

“మీ నాన్న చనిపోయిందగ్గరనుంచి నిన్ను కాస్త సరళమార్గంలో పెట్టేవారే లేరు. ఇంత చిన్నవయసులోనే నీకే బాధ్యతలూ, సంసారపు మర్మాలూ, యిక్కట్లూ అన్నీ నిన్నిలా వేపుకు తింటున్నాయి. ఎంతకని తిరగగలవు?......ఇంత

మంది బంధుగులున్నారు. సిరితో వుయ్యాలలూగుతుంటే—యీగలల్లే గుమికూడే వారే గానీ—అవసరానికి ఎవ్వరూ సహాయపడరు. పోనీ పొరుగువారా...? అన్య మతస్థులవాడలో చిక్కుకున్నాం. మతకలహాల్లో కల్లోలంగా కొట్టుకుంటున్న దినాల్లో మనల్ని కనికరించే డెవరు; వారిమీద ఆశ అణువైనా లేదు. ఇలాంటి దుర్దశలో ఎవరో వచ్చి సహాయపడటం ఎలా జరుగుతుందీ? పోనీ—అభిమాను లెవరేనా అడ్డుపడాలని వూహించినప్పటికీ - వాళ్ళ వ్యక్తులు (స్వమతాధికారులు) అతన్ని బ్రతుకనిస్తారా? రానురాను మన ఖర్మం యిలాగైపోయింది. ఒక్క దేశంలో పుట్టి, ఒక్క వాడలో తిరుగుతూ యిట్లాంటి అంతఃకలహాలు పెంచుకోవటం తెలివైనపనేనా? ఇలా ఏడుస్తున్న మన బ్రతుకులు యెలా పైకిరాగలవు?'

"అమ్మా! విచారించి ప్రయోజనం లేదు. ఇదిగో ఒక చక్కటి ఆలోచన చెప్పనా?"

"ఏమిటి కాంతం!"

"మా ప్రిన్సిపాలుగారు చాలా మంచివారు. వారిదగ్గఱకెళ్ళి ఏమేనా సహాయం అడుగుతాను. తప్పక సహాయంచేస్తారు. ఏమంటావమ్మా!"

"ఇలా అడుగుతున్నావని వారేమేనా అనుకోరుగదా?"

"లేదమ్మా! ఫరవాలేదు. ఆయన సుభాషితాలు, ఆయన ఔదార్యం అన్నీ వింటూంటే—యిట్లాంటి విశాలహృదయులు మనదేశంలో యింకా వున్నారా అనిపిస్తోంది. అప్పుడప్పుడూ మాక్లాసులో కొన్నిమాటలు చెప్పుతోంటే ఎంతోముచ్చట వేశేదే!"

"అలాఐతే నీ యిష్టప్రకారం వారిని కూడా అడిగిచూడు. ప్రొద్దుటే వెళ్దువుగానిలే! పొద్దుపోతోంది. కొంచెం అన్నంతిని.....అయ్యో! ఈపూట బియ్యంలేవు. రొట్టెలే చేశాను. అవే తిందువుగానిలే!"

"పోనీలేవే అమ్మా! నాకిప్పుడు ఆకలివెయ్యటంలేదు. నేనిప్పుడే మాష్టర్‌గారింటికి వెళ్తాను. ఇదేవేళలో వారు కొంచెం విశ్రాంతిగావుంటారు." అని చినిగిన షర్టు, రేగినజుట్టూ చూచుకోకుండానే ప్రయాణానికి సన్నాహపడుతున్నాడు.

"కాంతం! నిలువ్! ఏఁవిఁటీవేషం? పెట్టెలో మరొకషర్టువుంది వేసుకో! పెద్దవారింటికి అలాగేనా వెళ్ళటం?"

"ఏఁవిటమ్మా! షర్టునుచూచి ఆదరించరుగా!"

"లేదు నాన్నా! నామాట విను!"

"సరే! యిలా యివ్వు!"

"ఇప్పటికే ప్రొద్దుపోయింది త్వరగా రా నాన్నా! నీకోసరం—తిరిగి వచ్చేవరకూ అన్నం తినకుండా యిట్లాగే కూర్చుంటాను."

కాంతం కొంతదూరం నడిచి—"అమ్మా! ఒకవేళ ఆలశ్యమైతే అలాగే కూర్చోవద్దు. నాలుగు మెతుకులు తినేసి నిద్రపో! వీలైనంతవఱకు వేగంగా వస్తాను. అమ్మా! వెళ్తున్నా!" అన్నాడు.

కాంతుని కాలేజీ పఠనం ఒక సంవత్సరం పూర్తి అయింది. ఈ సంవత్సరంకూడా పూర్తి ఐతే కొంచెం ఫరవాలేదని అనుకున్నాడు. ఇంతలో తండ్రి చనిపోవటం—ఆస్థి పాస్తులన్నీ అప్పుల వాళ్ళకై పోవటం తటస్థించింది.

కాగా పోగా యీ చిన్న డాబాయిల్లు, కొద్ది ఫర్నిచరుమాత్రం మిగిలింది. ఈ మూడునెల్లూ దొర్లించితే ఏ గుమాస్తా గిరీ యో అవగలదు. అప్పటివఱకైనా సవ్యంగా జరిగే విధం ఏదీ? డబ్బు లేనిదే విద్యరాదు, విద్య నేర్వనిదే ధనమురాదు. ఇవీ పరిస్థితులు.

కళాశాలలో చదివే విద్యార్థులు కాంతాన్ని అతని పరిస్థితులు చూచి, గంటకు ఓ నిముషమైనా జాలి పడే వారు. ఎంతో ఘరానాగా జీవించిన

కుటుంబం! కాలం మారే సరికి వారి జీవితాలు కూడా చితికి పోయాయి.

క్లాసులో చురుగ్గా చదివే వారిలో కాంతం ఒకడు. అంచేత ఏ గురువులకైనా యితనంటే మిక్కిలి అభిమానము, గౌరవమున్నూ.

పరీక్షలు సమీపించాయి. అంచేత పరీక్షకి ఫీజు కట్టాలి! లేక పోతే పరీక్షలో కూర్చునే టందుకు అర్హత లేదు. ఎవరినేనా అడిగి ఆ కాస్త మొక్కు తీర్చుకోవాలని శుష్క యత్నాలు చేశాడు. కానీ ఓడలు బండ్లై, రోడ్లపై నడుస్తున్నాయి.

* * *

కాంతం వీధి వీధులు తిరిగి ప్రిన్సిపాల్ భవనానికి చేరుకున్నాడు. వరండాలో చిన్న లైటు మిణుకు మంటూ వెలుగుతోంది.

“మాష్టర్ గారూ......!”

జవాబు లేదు. గేటు దగ్గర బంట్రోతు గాఢంగా నిద్రిస్తున్నాడు. తలుపులన్నీ తెరుచుకునే వున్నవి.

వరండాలో టేబిల్ ప్రక్కగా సోఫామీద వసుంధర, ప్రిన్సిపాల్ కూతురు అప్పటి వఱకూ కాలేజీ పుస్తకాల్లో పుటలు త్రిప్పి—కునికి పాటులు పడుతూ వుంది.

కాంతం వచ్చేసరికి కనురెప్పలు మగతగా బరువై వాలిపోయినై. చేతిలో—కొంచెం పటుత్వంలో పుస్తకమింకా వ్రేలాడుతు నేవుంది, ఇంట్లో మరెవ్వరూ లేరు. మాష్టర్ గారు ఎక్కడో సభ జరుగుతుంటే—అధ్యక్షతగా ఆహ్వానాలు రాగా అక్కడికి వెళ్లారు.

పెరటిలోని సంపెంగపూలు వికసించి పరిమళ వాయువులు సన్నగా చెలరేగుతూవున్నాయి.

DEPENDABLE PLACE
*For* DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE, **SAREES**
BENGAL, etc.

SILKS of EVERY STYLE HANDLOOM COTTON SAREES, DHOTIES and other clothing materials.

ALL OF THE HIGHEST QUALITY

**S. R. B. Kuppuswamy Iyer & Son,**
(Formerly:—S. R. BALUSWAMY IYER & SONS)
230, East Marret Street, Madura. 'Phone: 36.
83, Nyneappa Naick Street, P. T,. Madras. 'Phone: 3506.

చిఱుగాలుల తాకిడికి వసుంధర చీనాంబరాలు, ముంగురులతోపాటు వుయ్యాలలూగుతున్నాయి. బరువుగల బంగారుదండలు కంఠాన్నితప్పించి సోఫా మీదుగా క్రిందికిజారినై. చేతిలోని పుస్తకం వదులుగా క్రిందపడింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుని— పెద్దచప్పుడు ఆమెను తృళ్ళింపజేసినది.

కాంతం నెమ్మదిగా వరండా మెట్లు పూర్తిగా ఎక్కి, నవ్యవిహారితలా నిమగ్నుడై కొంతసేపు మౌనంగా నిల్చున్నాడు. వాతావరణం నిశ్శబ్దంగా వుంది. ప్రిన్సిపాల్ గారు యింట్లోవున్నట్లు గోచరించుటలేదు. ఇంమక సంధిగ్ధుడై— మాష్టర్ గారూ అని పిల్చాడు.

వసుంధర తృళ్ళిపడి—ఏవో పలువరించుతూ "నాన్నా! వస్తున్నా!"—యింకా ఏమిటో గొణిగింది. కానీ నిద్రనుంచి లేవనేలేదు.

కాంతానికి కొంచెం భయమూ, సిగ్గూ వేసింది. కర్తవ్యాన్ని పురస్కరించుకుని ధైర్యంగా మఱొకసారి పిల్వయత్నించాడు. కానీ—మనస్సింతుకో ఆటంకపరుస్తోంది.

వసుంధర తన సహపఠిణి. చిరపరిచితురాలు. గురువుల ఏకైకముద్దులబిడ్డ. ఆమెనిద్రను భంగపర్చుటకిష్టపడక రెండుమెట్లుదిగి......సందేహంతో మఱల వెనక్కిమళ్ళాడు. మరొకసారి "మాస్టర్ గారూ!" అని పిలిచేసరికి వసుంధరకి మెలుకువ వచ్చింది. అలా కళ్ళువిచ్చకముందే "ఎవరూ...?" అని ప్రశ్నించింది. ఆమెకంఠం అతిలావణ్యంగా వుంది. తియ్యటిప్రశ్న ఎంతటివారినైన ప్రమత్తుని చేస్తుంది.

"నేను వసూ. లక్ష్మీకాంతం, నీక్లాస్ మేటు."

వసుంధర ఆశ్చర్యపడి—"కాంతం!! ఇంత చీకటిలో వచ్చావ్? రా! యిలాకూర్చో!" అన్నది ఆదరంగా.

కాంతం కుర్చీలో కూర్చున్నాడు. ఒక నిముషం యెవ్వరూ మాట్లాడలేదు.

"ఏం కాంతం! విషయాలు?"

"విషయాలేమీ లేవు. మీ నాన్నగారిని చూడాలని."

"హాఁ! మా నాన్నగారు కులాసాగానే వున్నారే!"

"అదికాదు వసూ కొంచెం పనిమీద..."

"సంగతేమిఁటి?"

కాంతం మౌనంగావున్నాడు. విషయాన్ని చెప్పేటందుకు సిగ్గుపడి చాప్టర్ మార్చటానికి యత్నిస్తాఁడు కూడా. సమాధానం అందుకోకుండానే—వసుంధర—

"రహస్యమా...?"

"కాదు........"

"......మరి...? నాతో చెప్పరానిదా?"

"లేదు వసూ—మీ నాన్నగారు ఎక్కడికి వెళ్ళారు చెప్పవూ?"

"నేతాజీ లైబ్రరీలో సభలో అధ్యక్షతకై పిల్చారు. అంచేత వెళ్ళారు. టైమైపోయింది. త్వరలోనే వస్తారు.

"సరే! థ్యాంక్స్. వెళ్తాను."

"ఏమిటి వెళ్ళటం? ఎందుకు వచ్చినట్లు? ఎందుకు వెళ్తున్నట్లు? ఏం! అంత వేగిరపడతావేం? గుఱ్ఱాన్ని వీధిలో కట్టలేదుగదా?"

"వసూ! పరిహసిస్తున్నావా? ఈ అభాగ్యునికి అంతటి అదృష్టమా?"

"అది అలభ్యమైనదని చెప్పటంలో అర్థంలేదు. ఆంధ్రకేసరిని నీవూ ఎఱుగుదువు. వారు ఇలా చదువుకునే దినాల్లో—యిట్లాంటి జీవితం తనను ఆహ్వానిస్తుందని ఏనాడైనా ఒక కలగన్నారూ? పోనీ వూసుపోనికాలంలోఅలాగని వూహాగానమైనా చేశారూ? "నా జీవితయాత్ర"లో ఆయన భోగట్టాలన్నీ విశదీకరించారు. నిజంగా ఎన్నడూ అనుకో

నవీ—ఏ క్షణంలోకూడా వూహించనివీ అప్పుడప్పుడూ ఒక్కొక్క సమయాల్లో జరుగుతునే వుంటై.

అట్లాంటి పరిస్థితులు తెలిసికూడా—అల్ప భాగ్యాన్ని పొందటమంటే కైలాసగిరిని మోసినంతగా భావిస్తావేం ?”

“ఏమిటి వసూ చాలా లెక్చరిస్తున్నావ్ ! నాకు శెలవివ్వవూ ?”

“మళ్ళీ అదేపాటా ? ప్లేటు మార్చుదూ !”

“ఏమీ లేదు కానీ—ఇంటిదగ్గఱ అమ్మ ఎదురు చూస్తూవుంటుంది, అంచేత త్వరగా వెళ్ళాలని...”

“కాంతాం నామాట వింటావా ? నేననేదీ—కాసేపు యిక్కడే వుండకూడదా ? అని.”

ఆమెమాటలు త్రోసిపుచ్చేటంతటి ధైర్యం లేదు కాంతానికి. ఏదో సుహృద్భావంతో పరామర్శ జరుగునని అపోహపడి, మరికొంతసేపు నిల్వటానికి అంగీకరించాడు.

కాంతం స్వభావసిద్ధంగా ఆకర్షణీయమైన వ్యక్తి, ఇంచక్కటి రంగు; నవనీతంలాంటి హృదయం కలవాడు. వట్టి అమాయకుడు. అతడు వీధి బళ్ళో చదువుకునేరోజులనుంచీ—అతనంటే వసుంధరకేకాదు మాస్టర్లు, సహపాఠకులతోసహా—అదొక అభిమానం చూపేవారు. వసుంధర కాంతాన్ని చూచినప్పుడల్లా ఆవిడహృదయం ఆమెతో సహా చెప్తూవుండేది. అతనిమీద ఓరకమైన యిష్టం ఆమె మనస్సులో కూడుకుపోయింది. అలాగని ఎన్నడూ కాంతంతో గానీ మరే యితర అంతరంగికులతో గానీ చెప్పనేలేదు.

ఈనాడు అప్రయత్నంగా కలుసుకున్నాడు. ఏవేవో మాట్లాడాలనుకున్న భావాలన్నీ భిన్నాభిన్నలై

ఎం. కె. సి.
సింహం మార్కు

* బనియన్లు * స్వెట్టర్సు
* అండర్ వేర్స్ * పుల్లోవర్స్
* లేడీస్ బ్లౌసెస్ * స్లిపోవర్స్ వగైరా....

మోహనరాం & కో వారి

* పంచెలు మరియు చీరలు

Stockists

MANOHARAN STORES
DEALERS IN HANDLOOM GOODS & GENERAL MERCHANTS
[Proprietors: V. S. M. GOPALAKRISHNIER & SONS]
181, EAST GATE :: MADURA
TELEGRAMS "HARANTALKY" PHONE No. 219

చివరకు ఒక్కసంగతి చెప్పలేకపోతుంది. పదినిమిషాలకాలం నిశ్శబ్దంగా వున్నారు. టేబిల్ మీద గడియారం అలారం కొడుతోంది. అది—పగలు కాలేజీ కాలమని చెప్తోంది కాబోలు! టైము సరిగా పది గంటలు. పరధ్యానంగా వుండటంచేత గంటలచప్పుడు కాంతాన్ని వీపుచరిచినట్లుగా తృళ్ళిపడ్డాడు.

వసుంధర మళ్ళా పలుకరించటానికి ప్రయత్నంచేస్తోంది. కొంచెం సిగ్గుగా పెదవులు తడిచేసుకుని.

"కాంత...!...మతీ...!"

"వసూ...! చెప్పవమ్మా! అలా జంకుతావేం?"

"ఏమీలేదు. ఏమో చెప్పాలనుకున్నాను. జ్ఞాపకంరాకుండావుంది."

"వసూ...అదేదో దాస్తున్నావు సుమా! ఇప్పుడిప్పుడే చిత్రించుకున్న భావన—యింతలో విస్మరించావంటే ఎవరేనా నమ్ముతారా?"

"లేదు కాంతం! ఆరోజు మనం 'టీ' పార్టీలోవుండగా......!"

"ఔను! ఎవరేనా ఏమేనా అన్నారా?"

"ఊఁహుఁ...ఎవ్వరూ ఏమనలేదు!"

"ఏమిటి మతీ?"

వసుంధర మాటలూ, వింటూంటే కాంతానికి ఏమీ తోచటంలేదు. వుండివుండి—

"చెల్లీ! క్షమించు" అని మెట్లు దిగుతున్నాడు.

"కాంతం! వెళ్ళకు. ఒక్కమాట విను. ఇది అర్థరాత్రి. నిర్జనవీథిలో వెళ్ళవద్దు. బజారులు చీకటిలో కలిసిపోయినై. అంతేకాదు! హిందు ముస్లిముల అసఖ్యతా కారణంచేత — సందులన్నీ అశాంతితో ప్రబలివున్నాయి. ఎటుపోయి యెటు వస్తుందో! ప్రాతఃకాలానికే వెళ్దువుకానీ నేటికి యిక్కడనే విశ్రమించు కాంతం!"

"ఫరవాలేదు. చెల్లీ శెలవు!" అని వెనుతిరగకుండానే మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

వీధిగేటువరకు వరండాలోని చిన్న దీపపు కాంతులు విస్తరించి వున్నవి. అమీదట చీకటి దట్టంగా అల్లుకుపోయింది. నీలిమబ్బులు అతివేగంగా నడుస్తూవున్నయ్. సంపంగి పువ్వులు విస్తుపోయి విశ్రాంతి తీసుకుంటున్నవి. కాంతం వొంటరిగా చంచలమనస్సుతో మార్గాన్ని వెతుక్కుంటూ—ఓరోడ్డు వెంటసాగి, ప్రయాణిస్తున్నాడు. మరికొన్ని గజాలు నడిచినమీదట ప్రిన్సిపాల్ గారు కొరులో ఎదురైనారు. కానీ—కాంతంమనస్సు చిందరవందరగా వుండటంచేత బాటతొలగి అన్యమనస్కంగా వెళ్తూవున్నాడు.

ఆమార్గం ఏమూలకు పోనున్నదో, ఏవీధికి చేరనున్నదో తెలియటంలేదు. మరొక రెండుగజాల్లో మేడలేవున్నవో; చెట్టులేవున్నవో: మురుగు కాలువలే వున్నవో పూహాతీతంగా వునై్న. చీకటి ఎటువైపు చూచినా చీకటి.

వసూ ఆడినమాటలన్నీ కాంతుని మనస్సులో గిఱ్ఱుమని తిరుగుతూనే వునై్న. మరొకవైపు తల్లి ఎంతగా ఎదురుచూస్తున్నదో అనేబెంగ యింకా కలవరపెడుతోంది. కొంచెం వేగంగా నడువసాగాడు. చీకటిలోంచి ఎవరో నలుగురు లాఠీలతో అతనిచుట్టు మూగారు. చిన్న బాటరీలైటు సహాయంతో కాంతుడు సజాతీయుడు కాడని తెలిసింది. నలుగురూ నాలుగుమోదారు కాంతం నిస్పృహాతో అమ్మా! అంటూ నేల కరుచుకుపోయాడు. రక్తధారలు అవిరామంగాపొంగి ప్రవహిస్తున్నాయి. బట్టనిండా ఎఱ్ఱటికణాలు నిండిపోయినవి. దిక్కుమాలి - నడివీధిలో వ్రాలిపోయాడు.

అప్పుడే కారుదిగాడు ప్రిన్సిపాలు. రాత్రి షుమారు పదకొండు అవుతోంది. వరండాలో చిన్న

దీపం ఒక్కటిమాత్రం వెలుగుతోంది. మిగిలిన ప్రదేశం చీకటిలో కలిసిపోయింది. వసుంధరఅప్పటి వరకూ చదువుకుని అప్పుడే సోఫామీద వ్రాలి వట్లుగా భావించాడు.

వసూ! అని ప్రేమగా పిల్చాడు మాష్టర్‌జీ! ఆమెలో ఆలోచనలు మరింతగా సాగుతున్నాయి కాబోలు! కాంతం! వచ్చావా? అంది అప్రయత్నంగా కానీ కళ్ళువిప్పి చూచేసరికి కాంతంకాదు. బడలికగా విస్తుపోయి నిల్చున్నతండ్రి. వసూ మాటలు విని విఘ్రాంతపోయాడు మాష్టర్.

"ఏమిటమ్మా! లక్ష్మీకాంతం వచ్చాడా?"

"ఔనునాన్నా! ఇప్పుడే యిలా వెళ్ళాడు. పదినిముషాలైనా కాలేదు. బజార్లనిండా కొట్లాటలు ఘోరంగా వున్నాయి. చీకటి అంధకారంగావుంది. ఇంతరాత్రిలో వెళ్ళవద్దనే చెప్పాను. ఎంతకూ వినలేదు. సాయంత్రం ఏడుమిషంచీ మీకోసం అలా కూర్చునిపోయాడు.

"ఆదేమిటమ్మా! నడిరాత్రిలో ఎలా వెళ్ళగలడని పోనిచ్చావు? అతనికి తెలీకపోతే నీవేనా ఎరుగవు?"

వసుంధర మాట్లాడలేదు.

"లే! మనవీధికి సమీపంలోనే ఒక వ్యక్తి ఎదురువచ్చాడు. అతడేనేమో! చూద్దాంరా!"

వసు అలాగే మెట్లుదిగి గేటుదగ్గఱకు వెడుతోంది ఆతృతగా.

"వసూ! నించోమ్మా! కారులో వెళ్దాం!' అన్నాడు.

ఇద్దరూకలిసి బయలుదేరారు. డ్రైవరు అతివేగంగా నడుపుతున్నాడు. వీధి మలుపులో ఎవరో నేలమీద పడివున్నారు. సడన్‌గా బ్రేక్ వేశాడు డ్రైవరు.

"ఏం! డ్రైవర్?"

"ఎవరో పడిపోయారు సార్!"

"ఎవరది!"

కారుదిగి చూచారు. కాంతం నిస్పృహతో పడిపోయాడు. రక్తం యింకా కొద్దిగా కారుతునే వుంది. తలనిండా ఎఱ్ఱటినెత్తురు గడ్డలు కట్టుకుంటున్నాయి.

వసుంధర హృదయం గట్టిగా కొట్టుకుంటూంది. వళ్ళు చెమటలు కారుతోంది, శరీరం వణకనారంభించింది. కళ్ళు గిఱున తిరుగుతున్నాయి.

డ్రైవరు, మాష్టరుకలిసి కాంతాన్ని కారులోనికి చేర్చారు. వసు వణకుతూ ఓమూల చేరగిలబడింది. తిన్నగా హాస్పటల్‌కు పొమ్మన్నాడు మాష్టర్!

ప్రిన్సిపాల్ గారి పలుకుబడిచేత - వారి మంచితనంచేత — వచ్చినరోగికి వెంటనే తగుచర్య తీసుకున్నారు. బెడ్డుమీద తెల్లటిదుప్పటి చాలవఱకు ఎఱ్ఱగా మారిపోయింది. కాంతునికి కట్టుకట్టటం పూర్తికావచ్చింది. వసూకి భయం. డాక్టరుగారి వుత్తరువులకై కనిపెట్టుకున్న మాష్టర్‌గారు విచారంగా వోవైపు కూర్చున్నారు.

"చాలారక్తం కారిపోయింది, నమ్మకం ఘట్టిగా చెప్పలేకుండా వున్నాం: కొంచెం రక్తం పట్టించితే ఏమేనా 'హోప్' వుంటుంది! అని ఆలోచిస్తున్నట్లు డాక్టర్లు చెప్పారు.

త్యాగబుద్ధి వసుంధర. డాక్టరు ఆ మాటలు అనగానే — తనరక్తాన్ని తీసికొమ్మని చెప్పింది వెంటనే.

డాక్టర్లు ఆమెరక్తాన్ని తీసి కాంతునికి పంచారు. వసుంధర మత్తుగా ఒకగంటసేపు పడిపోయింది. హాలంతా నిశ్శబ్దంగావుంది. గోడమీద గడియారం మాత్రం అలా కొట్టుకుంటూనే వుంది.

చిన్నముల్లు ఒంటిగంట దాటుతోంది. కొంత సేపటికి వసుకి తెలివిరావటంచేత బరువైన హృదయంతో కాంతుని చెంతనే కూర్చుని పోయింది. గంటలు నడిచిపోతున్నాయి. రెండు - మూడు - నాలుగు కావస్తోంది. రాత్రంతా నిద్రలేదు వారికి.

* * *

ఇంటిదగ్గఱ తల్లి కాంతం రాకకై నాలుగు వీధులూ చూస్తూంది. ఘడియలు వేగంగా దొర్లిపోతున్నవి. ఇంకా వస్తాడేమో యిద్దరూ కలిసి రొట్టెలు తినాలని అక్కడనే కూర్చునిపోయింది. నిద్రా...? ఎలా వస్తుంది? కలతగా అప్పుడప్పుడు కునికిపాటలు వచ్చినప్పటికీ - హృదయం అలా చూస్తునే వుంది. చీకటిరాత్రి! నక్షత్రాలేనా లేవు. మరేమీ పాలుపోవటంలేదు. కాలం జరిగినకొలదీ ఆతృత, ఆవేశం ఎక్కువౌతోంది. ఎంత వెదికిమాత్రం ఏంచేస్తుంది? దిక్కుమాలిన వనిత! అలా కళ్ళుచించుకుని - పదే పదే ఆశగా అన్నిత్రోవలూ వెతుకుతూంది.

ఇక్కడ కాంతం కొంచెంగా కదిలాడు. కళ్ళు విప్పకుండానే - ఎక్కడో నూతిలోవుండి పల్కినట్టు అమ్మా! అన్నాడు వణికే కంఠంతో!

వసు కళ్ళల్లో ఆశాజ్యోతి మెఱిసింది. వయనవాటికలో నవ్వుల సోనలు గిలిగింతలు పుట్టించినవి. చిన్న సంతోషకెరటం ఆమె అధరం మ్మాదుగా దొర్లిపోయింది.

ఇంతలో డాక్టరు - "వాళ్ళ అమ్మ ఎవరు? సమీపంలో వుంటే త్వరగా తెప్పించండి"అన్నాడు ఏమీ తోచక పోవటంచేత.

వసుంధర సంతోషంగా ప్రయాణమైనది. డ్రైవరు ఏమూలనో నిద్రపోతున్నాడు. పిల్చేటందుకు మనసు ఆమాత్రం వోపిక పట్టటంలేదు. ఆ కారును తనే కడుపుకుందామని బయులుదేరింది, కానీ వాళ్ళమ్మతో ఏమని చెప్పడం? ఇలాంటి దుఃఖమయ వార్తల్ని ఏమని వెలిబుచ్చటం? ఈమె వెళ్ళేసమయానికి వాళ్ళ అమ్మ ఏమిచేస్తూవుంటుందీ? ఆశాజ్యోతిని వెలిగించుకుని - స్వాగతగీతాన్ని వప్పగించేటందుకు వీధిగుమ్మంలో కాచుకుని వెతుకుతూ వుంటుందేమో! అలా-ఆ పరిస్థితుల్లో వున్న ఆమెకు ఈ విచారవార్తను ఏమని చెప్పవలెనో తోచక తనలో తాను తర్కించుకుంటూంది వసు.

గాలి భోరుమని వీస్తోంది. తూరుపురేఖలు అనంత భూగర్భంలో వోమూల జన్మింప సిద్ధంగావున్నాయి. వసుంధర కారులో అతివేగంగా వెళ్తోంది.

కాంతం పరిస్థితి మారిపోయింది. స్వవాదుల్లో కూర్చిన క్రొత్తరక్తం తన వాతావరణానికి సరిపడలేదు. రక్తకణాల్లో ఆంతరంగిక విప్లవం చెలరేగింది. వేడి తగ్గిపోతూంది. కనురెప్పలు మరింత బరువై వాలిపోయినవి. మరొకసారి మెల్లిగా అమ్మా! అన్నాడు. పాప మతనిహృదయం ఎంత బాధపడుతుందో తెలియటంలేదు. అతనిమనస్సు ఏపనిలో నిమగ్నత చెందివున్నదో అవగాహం కావటంలేదు. మళ్ళీ ఒక్కనిముషానికి చెల్లీ! వసూ! అంటూనే దీర్ఘంగానిట్టూర్చి నిద్రపోయాడు కాంతం వసూ అని సోదరభావంగా పిలవటమే అతని కడసారి మాటగా భావించబడింది.

తెల్లవారింది. కథంతా ఈ చీకటిరాత్రిలోనే జరిగింది. వసుకళ్ళలో విచ్చుకున్న పువ్వులు వాడిపోయినవి.

ఆశాజ్యోతిని వెలిగించుకుని ఆతృతపడే తల్లి కనీసం ఈ వార్తలైనా తెలుసుకుంటుందా? ఎలా తెలుస్తుంది? ఇంతకథనం విన్నాక-ఈవార్త అమ్మ, వింటే ఎలా వుంటుందో వూహించలేరూ?

సంతోషంగా. వేగంగా కారులో ప్రయాణిస్తూ, ఆలోచనా సముద్రంలో యీదుతున్న వసుంధరకీ కాంతుని దీర్ఘనిద్ర ఎవరుచెపుతారు? అలా చెప్పినప్పుడు వసు ఏమవుతుందీ?